క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగ సంఘ తెనాలి అధ్యక్షుడు షేక్ జానీబాషా, కార్యదర్శి ధర్మేంద్ర సాయి, ఉపాధ్యక్షుడు నున్న అజయ్‌కుమార్‌లు కోరారు. శుక్రవారం అమరావతిలోని గ్రామ/వార్డు సచివాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ శివ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జీవో నెంబర్ 5ను సవరించాలని సొంత మండలాల్లో, పట్టణాల్లో ఉద్యోగులు పనిచేసే విధంగా చూడాలని కోరారు. నేషనల్ ఇంక్రిమెంట్‌లో సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్‌లు వంటి వాటిని అమలు చేయాలని కోరినట్లు చెప్పారు.

నేడు సాహితీ ప్రముఖుడు రావినూతల జయంతి

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురుకు చెందిన ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు రావినూతల శ్రీరామమూర్తి 74వ జయంతిని శనివారం బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో గల పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో జరపనున్నారు. రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఏర్పాటయ్యే కార్యక్రమంలో పేద కళాకారులకు బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేయనున్నట్టు కళాకారుల సంఘం కన్వీనర్ గరికపాటి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పంచాయతీరాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీరుగా చేసిన శ్రీరామమూర్తి తన ప్రవృత్తి అయిన కళారంగ సేవలో చివరివరకు కొనసాగినట్టు గుర్తుచేశారు. జయంతి కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శాఖమూరి నారాయణప్రసాద్, డాక్టర్ కడియాల వెంకటరమణ, గణేష్ యూత్ వీరవల్లి మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, ఫౌండేషన్ ప్రతినిధులు ప్రకాష్, అన్నపూర్ణ, కుటుంబసభ్యులు పాల్గొంటారని వివరించారు.

తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదానం


తెనాలి: స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రీజినల బిజినెస్ హెడ్ కేబీబీ శ్రీనివాసు 43వ జన్మదినం సందర్భంగా రెయిన్‌బో బ్లడ్ సెంటర్‌లో 20 మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సాయం కోసం రక్తదానం చేసినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ పినిశెట్టి బాపూజీ, బ్రాంచి మేనేజరు జె.శ్రీనివాసరావు, సీనియర్ సేల్స్ మేనేజరు ఎం.నరేష్, జి.జయంత్ కుమార్, సిబ్బంది ఎ.లక్ష్మి, కె.మణికుమార్, ఆర్.శేషునాయుడు, పి.శ్రీధర్, రామయ్య, గోపాల్, రక్తదాతలు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



తెనాలిరూరల్: రెవెన్యూ దినోత్సవ వేడుకలను తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సత్కరించారు. 1978 జూన్ 20 నుంచి నేటికీ ప్రజా సేవలో రెవెన్యూ శాఖ విస్తృత సేవలు అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి



తెనాలిటౌన్: ప్రజల తాగు, సాగునీటి అవసరాలకు ఫాం పాండ్‌లు వినియోగపడతాయని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. రూరల్ మండలం పెదరావూరు గ్రామంలో నిర్మాణం చేసిన నీటి కుంటలను శుక్రవారం ఆమె సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ప్రతి గ్రామంలో ఫాం పాండ్‌లను నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు నీటి కుంటలు దోహదపడతాయని వెల్లడించారు. ప్రతి గ్రామంలో నీటి కుంటల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. ప్రస్తుతం పెదరావూరు, అంగలకుదురు, సంగంజాగర్లమూడి, తేలప్రోలు గ్రామంలో నీటి కుంతల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ఆనంద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

తాడేపల్లి రూరల్: రానున్న వర్షాకాలంలో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రతి ప్రాంతంలోను డ్రైనేజీల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. శుక్రవారం పెనుమాకలోని ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు డీఈ రాము తెలిపారు. ఇప్పటికే మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఉన్న డ్రైన్లలో పూడికతీత పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

తూనికలు, కొలతల శాఖ విస్తృత తనిఖీలు

- ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లలో 50–200 గ్రాముల వరకు తగ్గుదల
- 15 మందిపై కేసుల నమోదు



తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

తెనాలి: పట్టణంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్డు, చెంచుపేట, సుల్తానాబాద్‌లో రాత్రి 8 గంటల వరకు తనిఖీ చేశారు. డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్ ఆదేశాలపై తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు అమ్మే వ్యాపారులు, ఉల్లిపాయల వ్యాపారుల కేంద్రంగా ఈ తనిఖీలు కొనసాగించారు. ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు, సాధారణ కాటాలను పరిశీలించారు. చాలావాటిలో కిలోకు 50 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు తగ్గుదల ఉండటాన్ని గమనించారు. సాధారణ కాటాల్లో అరిగిపోయిన తూకం రాళ్లను వాడుతున్నారు. కొందరి కాటాలకు తూనికలు, కొలతల శాఖ స్టాంపింగ్ కూడా లేకపోవటాన్ని గమనించారు. తూకం తక్కువ ఉన్న వెయింగ్ మిషన్లను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదుచేశారు. స్టాంపింగ్ లేని కాటాలకు అక్కడికక్కడే నిర్ణీత రుసుము తీసుకుని స్టాంపింగ్ చేశారు. రాత్రి వరకు కొనసాగిన తనిఖీల్లో 40 మంది వ్యాపారులకు చెందిన తూనికలను తనిఖీలు చేశారు. వీరిలో తూకం తక్కువగా ఉన్న 15 మందిపై కేసులు నమోదుచేశారు. తనిఖీల్లో తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శేష సాయి, టెక్నికల్ అసిస్టెంట్ రవికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తోపుడుబండ్లపై పండ్లు విక్రయించే వ్యాపారులు, వినియోగదారుల కారణంగానే తాము ఇలా చేయాల్సి వస్తోందని నిర్భయంగా వెల్లడించారు. బేరాలు ఆడకుండా చెప్పిన ధరకు కొనుగోలు చేసేవారు నష్టపోకుండా తక్కువ తూకం ఉన్నప్పటికీ మొగ్గు రూపంలో అంతే మొత్తం హెచ్చుగా ఇస్తుంటామని చెప్పారు. ఎక్కడో తక్కువకు ఇచ్చారనీ చెబుతూ తమను అదే రేటుకు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండే వినియోగదారులకు తక్కువ తూకంతోనే ఇస్తామని స్పష్టంగా చెప్పారు. పచ్చి సరుకు అయినందున బేరాలు పోగొట్టుకోలేమని చెబుతూ వినియోగదారుల వైఖరి ప్రకారమే తమ వ్యాపారం ఉంటుందని అధికారుల ముందే చెప్పటం గమనించాల్సిన అంశం.

ప్రధాని మోదీ సేవలు అభినందనీయం



యోగాసనాలు వేస్తున్న శంకరరావు, వాకర్లు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

తెనాలిటౌన్: వికసిత భారత్ నిర్మాణంలో ప్రధాని మోదీ సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధానిమోదీ 11 సంవత్సరాల సుపరిపాలనపై అభినందన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లూరి జయప్రకాష్ నారాయణ పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని ప్రశంసించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు, అత్తలూరి బ్రహ్మయ్య, కాలిశెట్టి భావన్నారాయణ, తాళ్లూరి వెంకటరావు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

తెనాలిటౌన్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మండలస్థాయి అధికారులకు ఎంపీడీవో అత్తోట దీప్తి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో యోగాంధ్ర కార్యక్రమంపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉదయం ఆరు గంటల నుండి 8.30 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 33 వేలమంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని స్పష్టం చేశారు. యోగాసనాలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతాయని వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు జయప్రదం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి మండల స్థాయి అధికారులు నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో తహశీల్దార్ కెవి.గోపాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో వైవిడి.ప్రసాద్, ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, ఎపీఎం జయశ్రీ, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో అత్తోట దీప్తి

యోగ సాధనతోనే ప్రపంచశాంతి

తెనాలి: ప్రపంచ దేశాల ప్రజలందరూ యోగా ప్రక్రియలను ప్రతిరోజు నిరంతరాయంగా కొనసాగించగలిగితే ప్రపంచశాంతికి మార్గం సుగమం కాగలదని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అభిప్రాయపడ్డారు. స్థానిక తెనాలి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చినరావూరు పార్కులో నిర్వహించిన యోగా కార్యక్రమంలో శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగతో శారీరక, మానసిక వికాసంతోపాటు ఏకాగ్రత, ప్రశాంతత చేకూరుతాయని చెప్పారు. అప్పుడే మనసు సానుకూల నిర్ణయాలను తీసుకుంటుందని అన్నారు. సరైన నిర్ణయీకరణ శక్తి లేకపోవడం వల్లే, ఈరోజు పలు దేశాధినేతలు సంయమనం కోల్పోయి, శాంతి మార్గాన్ని త్యజించి,యుద్ధాలకు సిద్ధపడుతూ, ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్నారని విచారం వ్యక్తంచేశారు. నేడు పలు ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు–యుద్ధ వాతావరణం చూస్తుంటే, మూడవ ప్రపంచ యుద్ధం తప్పదన్నట్లు ప్రపంచ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. శాంతికాముక భారతదేశంతో పాటు మిగతా దేశాల ప్రభుత్వాలన్నీ,తమ తమ దేశాల ప్రజల జీవితాలలో యోగాను దైనందిన కార్యక్రమంగా నిర్వహించటం మంచిదన్నారు.

ఎస్‌బీఐ నేత తారక్‌నాథ్ సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రేమకుమార్

తెనాలి: భారతీయ స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన వై.తారక్‌నాథ్ సేవలు చిరస్మరణీయమని యూనియన్ తెనాలి ప్రాంతీయ కార్యదర్శి రావిపాటి ప్రేమకుమార్ అన్నారు. భారతీయ స్టేట్‌బ్యాంక్, హైదరాబాద్ సర్కిల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి దివంగతులైన తారక్‌నాథ్ 21 వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సాలిపేటలోని స్పెషల్ మున్సిపల్ మోడల్ ప్రైమరీస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్సిల్స్, ఎరేజర్స్, షార్పనర్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి ప్రేమకుమార్ మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది ఉద్యోగ సంబంధిత విధివిధానాలను ఆధునీకరించిన ఘనత తారక్‌నాథ్‌కే దక్కుతుందన్నారు. బ్రాంచ్ కార్యదర్శులు పద్మసాయి, సతీష్, హేమనాయక్, రాజాకిషోర్, మణికంఠ, సౌమ్య పాల్గొన్నారు. అనంతరం గాంధీనగర్‌లోని పట్టణ పేదల నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. నిర్వహించారు. బ్యాంక్ శాఖా కార్యదర్శులు అంజయ్య, టీవీఎస్ రావు, శ్రీనివాసరావు ఆశ్రమంలోని పేదలకు భోజన వసతిని అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి టౌన్: నారా భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీ ఆరుష్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్‌స్టార్ హాస్పిటల్స్ వైద్యుల సహకారంతో మంగళగిరి నగర పరిధిలోని వైష్ణవి కల్యాణ మండపంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుమారు 700 మందికి వైద్యసేవలు అందజేశారు. రోగులకు పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, వైద్యులు శ్రీహరి, హేమేశ్వరరావు, సందీప్, ప్రశాంత్, నీలిమ, గౌతమ్‌కృష్ణ, రాకేష్‌లతో పాటు మంగళగిరి పట్టణ, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తెనాలి ఘటనపై నిరసన



తాడేపల్లి రూరల్: తెనాలి అయితా నగర్‌లో జరిగిన పోలీసుల అమానవీయ చర్యను ఖండిస్తూ తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ.. పోలీసులు తమ హీరోయిజాన్ని ప్రదర్శించడం కోసం దళిత, మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా పోలీసులు లెక్కచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారని విమర్శించారు. తెనాలి పోలీసుల చర్యల పట్ల మౌనంగా ఉంటే ప్రజాస్వామ్యంలో ప్రజల మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, బి.ప్రభాకర్, చిన్ని దుర్గారావు, మహేష్, శ్రీకాంత్, అంకయ్య, నవనీతమ్మ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ రవికుమార్

తాడేపల్లి రూరల్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యత అని గుంటూరు అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికుమార్ మాట్లాడుతూ.. నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు జరగకుండా నివారించడమే ముఖ్యమని అన్నారు. మంచి అలవాట్లు అలవరచుకోవడం ప్రతి విద్యార్థి కర్తవ్యమని సూచించారు. మంగళగిరి నార్త్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పలితాల గురించి అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని సూచించారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. తమ వర్సిటీలో ఎటువంటి ర్యాగింగ్ లేకుండా ప్రతి విద్యార్థి ఎంతో సంతోషంగా, భద్రంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు, వర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, అసోసియేషట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ వి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హామీని అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేశ్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికులు గత 199 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని.. అయినా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, పిచ్చయ్య, గురవయ్య, నాగేశ్వరరావు, హగ్గయ్యలు, మాణిక్యరావు, షేక్ బాషా, షేక్ సుభాని, ఇమాంబీ, శివకుమారి, దుర్గాభవాని, రమణ, సారమ్మ, బి.సూర్యప్రకాశరావు, వై.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మంగళగిరి టౌన్: ఈనెల 22వ తేదీ నుంచి జరిగే జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధానీలు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం క్రీడాకారులను ఎంపిక చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని దావనగిరి పట్టణంలో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరిగే నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, ఎక్యూప్ట్ పవర్ లిఫ్టింగ్ (మెన్, ఉమెన్) పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను జిల్లాకు చెందిన 12 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఉమెన్స్ సబ్‌జూనియర్ టీమ్‌లో అంజలి (69 కేజీల విభాగం), లిఖిత (76 కేజీల విభాగం), వినయశ్రీ (84 కేజీల విభాగం).. ఉమెన్ జూనియర్ టీమ్‌లో షానూన్ (47 కేజీలు), సాదియా ఆల్మాస్ (76 కేజీలు), షబ్బీనా, జ్ఞానదివ్య (84 కేజీలు).. మెన్ సబ్ జూనియర్ టీమ్‌లో మణిచంద్ (74 కేజీలు), మునీశ్వర్ రామ్ (84 కేజీలు).. మెన్ జూనియర్ టీమ్‌లో జమీల్ ఖాన్, పృథ్వీకుమార్ (105 కేజీలు).. సీనియర్ ఉమెన్ కేటగిరిలో బి.చంద్రిక (84 కేజీలు)లలో పోటీ పడతారని తెలిపారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



సీలింగ్ ఫ్యాన్‌లను అందజేస్తున్న అయ్యప్ప, సుమలత

తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు అద్దేపల్లి అప్పయ్య, సుమలతల పెళ్లిరోజును పురస్కరించుకుని ఐతానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌కు రెండు సీలింగ్ ఫ్యాన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ నేరెళ్ళ వెంకట కృష్ణమోహనరావు మాట్లాడుతూ తమకు క్లబ్ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం, ట్రెజరర్ లయన్ డాక్టర్ కడియాల పల్లవి, అయినాల మల్లేశ్వరరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం చావాలి సువర్ణలత, సుజాత, కరస్పాండెంట్ ఎస్.లతకుమారి, జాకబ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



సూచనలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాల గుట్టలు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. మారీసుపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ప్రతి రోజు ఉదయం తొలగించాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

వ్యర్థంతో అనర్థం!



ఐతానగర్‌లోని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇంటి సమీపంలోని మురుగు కాల్వలు వ్యర్థాలతో నిండాయి. ఖాళీ వాటర్ బాటిల్స్, ఇతర వ్యర్థాలు వాటిలో వేయడం వలన పారుదల నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. 15 రోజుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్న కాల్వలను ఎవరు బాగు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాల్వలను బాగు చేయించాలని కోరారు. – తెనాలిఅర్బన్

స్థానికంగానే వెసులుబాటు కల్పించాలి

యూపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్



కొల్లిపర మండల ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేస్తున్న సచివాలయం ఉద్యోగులు

కొల్లిపర: గ్రామ సచివాలయంలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న అధికారులు స్థానిక మండంలోనే ఏదో గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే విధంగా ప్రభుత్వం వెలుసుబాటు కల్పించాలని యూనైటెడ్ ప్రోగ్రెసివ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండికల్లా సతీష్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మండలంలోని 20 గ్రామాల్లో ఎక్కడో ఒక గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే విధంగా వెలుసుబాటు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలిఅంటూ సచివాలయం ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీవో వి.విజయలక్ష్మికి తమ సమస్యలు తెలియజేసి, వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులను వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, అంతర్ జిల్లాల బదిలీలు అనుమతించాలని, పెండింగ్ లో ఉన్న రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జాబ్ కార్డులు పక్కాగా అమలు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, యూనియన్ నాయకులు జూలాది అంబేద్కర్, మధుసూదన రెడ్డి, రాజేష్‌నాయడు, కంచర్ల శృతి, హెలానా, ఫణింద్ర వర్మ, డింపుల్ శశి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం

కొల్లిపర: రెవెన్యూ శాఖలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది పాటిస్తూ, ప్రజల సమస్యలపై అవగాన పెంచుకొని తద్వారా సమన్వయంగా విధులు నిర్వహించి రెవెన్యూ శాఖకు మంచి పేరు వచ్చేలా ప్రతి రెవెన్యూ ఉద్యోగి కృషి చేయాలని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జి.సిద్ధార్థ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసురత్నం పాల్గొన్ని మాట్లాడుతూ నేటి సమాజంలో ఏటు వంటి సమస్య వచ్చిన వెంటనే రెవెన్యూ శాఖ స్పందించి ఆ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ సమస్య పరిష్కరిస్తుందన్నారు. గ్రామంలోని ప్రతి రెవెన్యూ ఉద్యోగి కష్టపడి పనిచేసి రెవెన్యూ శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఏ దేశంలో అయిన ఎన్నికలు నిర్వహించాలంటే కీలక పాత్ర పోషించేది ఒక్క రెవెన్యూ శాఖ అని కొనియాడారు. అనంతరం రెవెన్యూ అధికారులు విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం, స్థానిక విశ్రాంత తహసీల్దార్ కోటిరెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఎఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకుంటే అద్భుతమైన ఫలితాలు

మంగళగిరి టౌన్: ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకుని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలుంటాయని మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవిన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని అన్నారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూశాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం రెవెన్యూ డేలో పాల్గొన్న రైతులకు అడంగల్, వన్‌బీలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కార్యాలయ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.